జగదీశ్వర్ పేరుతో మల్లంపల్లి మండలం ఏర్పాటు చేయాలి

- అధికారుల ప్రోత్సాహం మరువలేనిది
- పోడు రైతులకు రైతు బంధు వర్తింపజేయాలి
- ములుగు జడ్పీ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, పక్కన ఎమ్మెల్యే వెంకట్రావ్

ములుగు, జూలై 3 (నమస్తే తెలంగాణ) : ములుగు మండలం మల్లంపల్లి గ్రామాన్ని దివంగత జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ పేరుతో ప్రభుత్వం ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. బుధవారం జడ్పీ సర్వసభ్య సమావేశం నాగజ్యోతి అధ్యక్షతన నిర్వహించగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ టీఎస్ దివాకర, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలో వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పారదర్శకంగా పోడు రైతులకు పట్టాలు ఇచ్చిందని, వారందరికీ రైతు భరోసా అందేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడంలో సహకరించిన అధికారులందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు సమన్వయం తో పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనులకు అటవీ శాఖ అధికారులు అభ్యంతరాలు చెప్పవద్దని సూచించారు. ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ జిల్లాలోని వెంకటాపురం(నూగూరు), వాజేడు మండలాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నారు. జిల్లా పరంగా, నియోజకవర్గ పరంగా ఈ మధ్య కాలంలో రెండు మండలాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. రైతు భరోసా అమలులో ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేస్తుందని, రైతులంతా అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతులకు బోరు బావులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి ఆధ్వర్యంలో సభ్యులకు సన్మానం చేశారు. సమావేశంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో శ్రీనివాస్‌కుమార్, జడ్పీటీసీలు గైరుద్రమదేవి, తుమ్మల హరిబాబు, కరం చంద్‌గాంధీ, తల్లాడి పుష్పలత, పాయం రమణ, కో ఆప్షన్ సభ్యులు వలియాబీ, రియాజ్‌మిర్జా, ఎంపీపీలు రజిత, శ్రీనివాస్‌రెడ్డి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న సిబ్బంది

ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు

మహాముత్తారం, జూలై 3 : ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో మండల పరిషత్ కార్యాలయంలో స్పెషల్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు మండల పరిషత్ సిబ్బంది వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ రత్నం సుభద్ర మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, పదవీకాలం ముగిసినా ప్రజలకు తమ వంతుగా సహకారం అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకుడు రాజిరెడ్డి ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. జడ్పీటీసీ లింగమల శారద, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తవ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

ములుగురూరల్, జూలై 3 : గొత్తికోయలు తమగూడెంలోకి కొత్త వ్యక్తులు వస్తే ఆశ్రయం కల్పించొద్దని ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని జగ్గన్నగూడెం సమీపంలోని బోడరామయ్య గడ్డ గొత్తికోయ గుంపును ఆయన సందర్శించారు. గూడెంలోని బడీడు పిల్లలను బడికి పంపించాలని సూచించారు. అనంతరం మావోయిస్టుల ఫొటోలతో ఉన్న పోస్టర్లను గ్రామంలో అంటించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

వ్యవసాయ భూమి అమ్మబడును

★12ఎ|| తరి పొలము, 10ఎ|| రాగడి, వీటికి నీటి సౌకర్యం కలదు. ముస్త్యాలపల్లి గ్రామం, నడికూడ మం||, హనుమకొండ జిల్లా. ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323325

CHANGE OF NAME
★I, BINGI BHAGYALAKSHMI (Old Name), W/O. GUNDU KAMESHWAR, R/O. H.No. 11-23-250, L.B.Nagar, Adarsha Veedhi, Warangal. That have changed my name as GUNDU BHAGYALAXMI (New Name), W/O. GUNDU KAMESHWAR.
NTW-0405

PLOT FOR SALE
★1089 గజముల ప్లాట్, సర్వే నెం. 187, L.R.S. కూడా కట్టబడినది. దర్గా గ్రామం, కాజీపేట మండలం, ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323326

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ప్రజల కోసం పనిచేస్తేనే పదవులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు

టేకుమట్ల : ఎంపీపీ, జడ్పీటీసీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

చిట్యాల /గణపురం/ రేగొండ/ టేకుమట్ల, జూలై 3 : రాజకీయ నాయకులకు పదవీ విరమణ ఉండదని ప్రజల అభీష్టం మేరకు పనిచేస్తే పదవులు వాటంతటఅవే వస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం చిట్యాల, గణపురం, రేగొండ, టేకుమట్ల మండల పరిషత్ కార్యాలయాల్లో మండల సర్వసభ్య, పాలకవర్గ వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజాప్రతినిధులను ఆయన సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పదవులు ఎప్పుడూ శాశ్వతం కాదని, గెలిచినా, ఓడినా ప్రజా సేవలో ఉన్నప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమిటీ కావటి రజిత రవీందర్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య,పాలకవర్గ వీడ్కోలు సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను బుద్ధారం సర్పంచ్‌గా రాజకీయ ప్రస్తానాన్ని ప్రా రంభించి జడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా ప్రజలు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్ని గ్రామాల అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించానన్నారు. రెండేళ్లలో గణపురం మండలకేంద్రాన్ని అందరూ ఆశ్చర్యపోయేలా అభివృద్ధి చేస్తానన్నారు. గణప సముద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేశానని తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ అనుమతితో పనులు చేపడుతామన్నారు. కొడంగల్, మధిర నియోజకవర్గాల మాదిరి భూపాలపల్లి నియోజకవర్గానికి సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. భూపాలపల్లి నుంచి మండలకేంద్రాన్ని కలిపేలా ఔటర్ రింగ్ రోడ్డు పనులు చేపడతానని, గాంధీనగర్ గ్రామాన్ని ఎడ్యుకేషనల్ తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమాల్లో గణపురం ఎంపీపీ కమిటీ కావటి రజిత రవీందర్, ఎంపీడీవో భాస్కర్, నాయబ్ తహసీల్దార్ భాస్కర్, పశు వైద్యాధికారులు గంట పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, కో ఆప్షన్ సభ్యులు చోటేమియా, సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్, ఎంపీటీసీలు మోటపోతుల శివశంకర్‌గౌడ్, మంద అశోక్‌రెడ్డి, మారగాని సరస్వతీ శ్రీనివాస్‌గౌడ్, పొనగంటి సుధర్మ మలహల్ రావు, జంగిలి భవిత సుధాకర్, రాసపెల్లి లావణ్యా కుమారస్వామి, ఏవో దేశబోయిన ఐలయ్య, విద్యుత్ శాఖ అధికారి వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, పీఆర్ ఏఈ నరేశ్, ఏఈవోలు ప్రణయ్, మౌనిక, పంచాయతీ కార్యదర్శులు హరిచంద్రారెడ్డి, ఉమ్మల్ల విజేందర్, ముక్కెర హేమంత్, శ్రీకాంత్, నవీన్, రమేశ్, షఫీ, రా కేశ్, నాగమణి, రేగొండ మండల ప్రత్యేక అధికారి సామేల్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, ఎంపీటీసీలు, అధికారులు, కాంగ్రెస్ టేకుమట్ల మండలాధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, మండల ప్రత్యేక అధికారి శైలజ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, వైస్ ఎంపీపీ ఐలయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, ఎంపీపీలు దావు వినోద, ఎం సుజాత, జడ్పీటీసీలు సాగర్, జోరుక సదయ్య, ఎంపీడీవో జయశ్రీ , ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

వెంకటాపూర్: విద్యార్థులతో మాట్లాడుతన్న శ్రీజ

వెంకటాపూర్, జూలై 3 : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. బుధవారం మండలంలోని జవహర్‌నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యను అభ్యసించడంలో మెళకువలు నేర్చుకోవాలని, జీవిత ఆశయం కోసం సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఉపాధ్యాయ బృందం సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ములుగురూరల్ : ప్రభుత్వ దవాఖానలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. బుధవారం ములుగు ప్రభుత్వ దవాఖానను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వైద్యసేవల కోసం వచ్చే గర్భిణుల కోసం కుర్చీలు అందుబాటులో ఉంచాలన్నారు. నవజాత శిశువుల కోసం ఇంక్యూబేటర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యంచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట దవాఖాన సూపరింటెండెంట్ జగదీశ్వర్, సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం

వెంకటాపురం (నూగూరు), జూలై 3 : మండలంలో నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ఇంటర్ విద్యా విభాగం నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తామని ములుగు జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రవేశాల సంఖ్య వివరాలను, విద్యార్థుల మౌలిక సౌకర్యాలు ఎలావున్నాయో? అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయకుమార్, అకాడమిక్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రాజు, జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ప్రసాద్, సునీల్, ఆదినారాయణ ఉన్నారు.

ప్రజా సేవ నిరంతరం సాగాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, జూలై 3 : ప్రజా సేవ చేయడానికి పదవే అవసరం లేదని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధిలో నిరంతరం భాగస్వాములు కావొచ్చని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండల ప్రజా పరిషత్ పాలక వర్గం పదవీ కాలం ముగియడంతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వారికి వీడ్కోలు సభ నిర్వహించారు. సభ్యులను వివిధ శాఖల అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మంత్రి శ్రీధర్‌బాబు విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎంపీపీ పంతకాని సమ్మయ్యతోపాటు ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, వైస్ ఎంపీపీ తిరుమల, ఎంపీటీసీలు తోట జనార్దన్, రవీందర్‌రావు, అజీజ్, మహేశ్వరి, విజయారెడ్డి, మమత, రూపాదేవి, బక్కమ్మ పాల్గొన్నారు.

కొండచిలువ మృతి

గణపురం, జూలై 3: మండలంలోని లక్ష్మిరెడ్డిపల్లిలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని కొండచిలువ మృతిచెందింది. గ్రామానికి చెందిన ఏ మల్లారెడ్డి ఇంటి ఆవరణలో చనిపోయి ఉన్న పామును నిర్మానుష్య ప్రదేశంలో వదిలేశారు. పామును చూసిన గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

'రైతు భరోసా'పై ప్రత్యేక సమావేశం

మహదేవపూర్(మల్హర్): సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలహర్‌రావు

వెంకటాపూర్/మంగపేట /మహదేవపూర్(మల్హర్)/ చిట్యాల, జూలై 3 : మల్హర్ మండలం కొయ్యూర్ రైతు వేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రైతు భరోసా పథకంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఏవో విజయ్‌భాస్కర్ హాజరై రైతుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అయిత కోమల, ఎంపీటీసీ ప్రకాశ్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు తిరుపతిరావు, బానోత్ సమ్మక్క, రమేశ్, ఏవో సుధాకర్, ఏఈవో, రైతులు పాల్గొన్నారు. అలాగే చిట్యాల రైతువేదికలో పీఏసీఎస్ చైర్మన్ కుం భం క్రాంతికుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పదెకరాల్లోపు ఉన్న వారి కి రైతు భరోసా ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన డీసీవో శైలజ మాట్లాడుతూ రైతుల నుంచి స్వీకరించిన సలహాలు, సూచనలను రాష్ట్ర ప్రభు త్వానికి నివేదిస్తామని తెలిపారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఏర్కొండ గణపతి, సహకార సంఘం ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, సీఈవో మొగిలి, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజేందర్ రెడ్డి, రాజయ్య, కోటేశ్వర్, వనమాల, రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు. మంగపేట మండలకేంద్రంలోని గంపోని గూడెం రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా సహకార అధికారి సర్దార్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో 60 మంది రైతులు పది ఎకరాలలోపు వారికి రైతు భరోసా ఇవ్వాలని, 5 ఎకరాల్లోపు వారికి ఇవ్వాలని 11, వ్యవసాయేతర భూములకు ఇవ్వొద్దని 15 , సాగు చేసే వారికి మాత్రమే ఇవ్వాలని 15, రీసర్వే చేసి ఇవ్వాలని 10, కాస్తులో ఉన్న వారికి ఇవ్వాలని 10 , కౌలు దారులకు కూడా ఇవ్వాలని ఐదుగురు వ్యక్తులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి ఎన్ చేరాలు, సీఈవో జగన్నాధరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేందర్, డైరెక్టర్లు లక్ష్మణ్‌రావు, నర్సయ్య, శ్రీధర్, సత్యనారాయణ, ఆదినారాయణ, బాబూరావు, బాలకృష్ణ, ఏఈవోలు మహేశ్, భావన, మౌనిక, గాయత్రి, మాజీ రైతుబంధు జిల్లా సభ్యుడు శేషగిరిరావు, మాజీ జడ్పీటీసీ వైకుంఠం, జయరాంరెడ్డి, పీఏసీఎస్ కార్యాలయ సిబ్బంది రమేశ్ పాల్గొన్నారు. వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏడీఏ శ్రీపాల్ ఉన్నతాధికారు ఆదేశాల మేరకు రైతువేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రావు మాట్లాడుతూ సాగుచేసే ప్రతి రైతుకూ రైతుభరోసా అందించాలని, కౌలు రైతులకు, పోడు భూములు సాగు చేసే రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో కల్యాణి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నగేశ్, ఏఈవో దయానా పాల్గొన్నారు.

మావోయిస్టుల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వాలి : ఎస్పీ శబరీష్

ఇసుక కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎస్పీ

ములుగు, జూలై 3 (నమస్తే తెలంగాణ) : మావోయిస్టుల పేరుతో జిల్లాలోని కాంట్రాక్టర్లు, ఇసుక క్వారీ నిర్వాహకులను డబ్బులు డిమాండ్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ శబరీష్ అన్నారు. బుధవారం ఆయన ఓఎస్డీ మహేష్ బీ గీతే, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి ఇసుక క్వారీ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఇసుక రవాణా లారీ యజమానులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వే బిల్లులు లేకుండా ఇసుక తరలించడం, పరిమితికి మించి లారీల్లో అక్రమంగా ఇసుక ఓవర్ లోడ్ చేయడం మానుకోవాలని తెలిపారు. ఇసుక క్వారీలను నిబంధనల మేరకు నిర్వహించాలని అన్నారు. తెలంగాణలో మావోయిస్టు పార్టీ తన ఉనికిని కోల్పోయిందని, ఎవరూ వారికి సహకరించొద్దన్నారు. డీఎస్పీ రవీందర్, ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, కాంట్రాక్టర్లు ఉన్నారు.

'బిల్టు కార్మికుల వేతన సమస్యలు పరిష్కరించాలి'

మంగపేట, జూలై 3 : ఉత్పత్తి మార్కెటింగ్ సమస్యతో నిలిచిన కమలాపురం బిల్టు ఫ్యాక్టరీ కార్మికుల వేతన సమస్యలు పరిష్కరించాలని పలువురు సీనియర్ కార్మికులు కోరారు. స్థానిక పంచాయతీ ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పలువురు కార్మికులు, వారి కుటుంబసభ్యులు పాల్గొని హైకోర్టు లాయర్ల సమక్షంలో వారి పెండింగ్ వేతన సమస్యలను ఏకరవు పెట్టారు. కార్మిక చట్టాల ప్రకారం.. వేతన సెటిల్‌మెంట్ ప్రక్రియలో తమకు న్యాయం జరుగులేదన్నారు. సుమారు 30 ఏళ్లుగా రేయింబవళ్లు ఫ్యాక్టరీ అభ్యున్నతి కోసం శ్రమించి పరిశ్రమను లాభాల బాటలో నడిపామన్నారు. అయితే సీనియర్, జూనియర్ విభాగాల కార్మికులకు వేతన సెటిల్‌మెంట్ కార్మిక చట్టాల ప్రకారం.. న్యాయంగా జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ కార్మికులకు రూ. లక్ష నుంచి 2 లక్షల వరకు, జూనియర్లకు రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకు మాత్రమే ఖతాల్లో వేసి చేతులు దులుపుకున్నారని ఇది తీవ్ర అన్యాయమన్నారు. ఈ వ్యవహారంలో తమకు న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిపారు. వయసు ఆధారంగా సర్వీస్ ఉన్న వాళ్లతో పాటుగా, చనిపోయిన కార్మికుల పిల్లలకు ఫ్యాక్టరీలో పనులు కల్పించి జీవనోపాధి దెబ్బతినకుండా చూడాలని కోరారు. అదే విధంగా ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు ఎన్జీ ఎల్టీ కోర్టు ఒప్పందం ప్రకారం.. వేతన సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల ప్రకారం.. న్యాయబద్ధంగా వేతన సెటిల్‌మెంట్ జరపాలని, పర్మినెంట్ కార్మికులతో పాటు, తాము కూడా ఫ్యాక్టరీలో శ్రమించినా తమకేమీ న్యాయం జరుగలేదని మరోవైపు కాంట్రాక్టు కార్మికులు సైతం సమావేశంలో వాపోయారు.

ట్రాక్టర్ బోల్తాపడి కూలీ మృతి

తాడ్వాయి, జూలై 3 : ట్రాక్టర్ బోల్తా పడి కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని కాల్వపల్లి సమీపంలోని తూములవాగు వద్ద బుధవారం జరిగింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన తిప్పారపు రఘు(42) ట్రాక్టర్‌లో కాల్వపల్లికి ఇటుక తీసుకొచ్చి అన్‌లోడ్ చేశారు. తిరిగి పస్రాకు వెళ్తుండగా తూములవాగు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఇంజిన్‌పై కూర్చున్న రఘు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై నూతన చట్టాల ప్రకారం మొదటి కేసును నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రవి(ఫైల్)

కాటారం, జూలై 3 : మండలంలోని గారెపల్లి గ్రామానికి చెందిన దిండు రవి (40) బుధవారం నస్తూర్‌పల్లి అటవీప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రవి మండలకేంద్రంలో కిరాణాషాపు నడిపిస్తూ భార్య శ్రీలత, కుమారుడు హర్షిత్, కూతురు హర్షిణితో కలిసి జీవిస్తున్నాడు. ఇల్లు నిర్మించుకోవడంతో పాటు అనారోగ్య సమస్యలతో దవాఖానల చుట్టూ తిరగడంతో అప్పులయ్యాయి. వాటిని తీర్చలేక మనస్తాపం చెందిన రవి బుధవారం ఇంటి నుంచి నస్తూర్‌పల్లి అటవీప్రాంతంలోకి వెళ్లాడు. స్నేహితులకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని తెలిపాడు. వారు రవి అన్నయ్య శశికుమార్‌కు సమాచారమిచ్చి అటవీ ప్రాంతానికి వెళ్లి తిరుగుతుండగా ఓ చెట్టుకు నైలాన్ దారంతో ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

ఐఐఐటీ సీట్లు సాధించిన వెంకటాపూర్ విద్యార్థులు

వెంకటాపూర్, జూలై 3 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు బుస్స అక్షిత, గొట్టె శివకుమార్ ఐఐఐటీ బాసరలో సీట్లు సాధించారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అక్షిత, శివకుమార్ బాసరలో సీట్లు సాధించడం ఆనందంగా ఉందని హెచ్ఎం రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

వరదలతో అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం, జూలై 3 : వర్షాకాలంలో ఎదురయ్యే విపత్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్ టీం ఇన్‌స్పెక్టర్ భూపేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు కోరారు. మండలంకేంద్రంలోని రైతువేదికలో స్థానిక డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు విపత్తులపై అవగాహన కల్పించారు. ప్రధానంగా వరదలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. వరదలు రావడాన్ని ముందుగానే గుర్తించి అక్కడ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు. ఆపదలో ఉన్నపుడు తమ సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్సై నరేందర్, కళాశాలల ప్రిన్సిపాళ్లు భగవద్గీత, వసంత, అధ్యాపకులు అరుణ, స్వప్న పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

కృష్ణకాలనీ, జూలై 3 : టామ్‌కామ్ ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ ఆఫ్ జర్మనీ ప్రభుత్వ భాగస్వామ్యంతో ట్రిపుల్ విన్ ప్రాజెక్టు కింద జర్మనీలో ప్లేస్‌మెంట్ కోసం నర్సులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నదని జిల్లా ఉపాధి అధికారి అరూరి శ్యామల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 38 ఏండ్లు ఉండి, తెలంగాణలో గుర్తింపు పొందిన కళాశాల నుంచి జీఎన్ఎమ్, బీఎస్సీ నర్సింగ్, ఐసీయూ, జెరియాట్రిక్స్, ఆర్థోపెడిక్, సైకియాట్రీ, కార్డియాలజీ, నియోనాటల్, సర్జికల్ ఉత్తీర్ణత సాధించాలన్నారు. కనీసం మూడుసంవత్సరాల ప్రొఫెషనల్ క్లినికల్ అనుభవం, జర్మనీ భాషా నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్ బేగంపేటలోని హోటల్ ది ప్లాజా 2వ అంతస్తులో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లేదా www.tomcom.telangana.gov.inలో లేదా TOMCOM మొబైల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9908830438, 8919047600, 7032379066, 84999 90304, 6302292450 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

భూపాలపల్లి జిల్లాలో మోస్తరు వర్షపాతం

భూపాలపల్లి రూరల్, జూలై 3 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బుధవారం ఉదయం 8:30 గంటల వరకు 9.7 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మహదేవపూర్ మండలంలో 14.8 మిల్లీ మీటర్లు, మహాముత్తారం 12.4 మి.మీ, పలిమెల 2.8 మి.మీ, కాటారం 14.6 మి.మీ, మల్హర్‌రావు 20.4 మి.మీ, టేకుమట్ల 5.8 మి.మీ, మొగుళ్లపల్లి 6.4 మి.మీ, చిట్యాల 6.6 మి.మీ, రేగొండ 6.6 మి.మీ, గణపురం 4.2 మి,మీ, భూపాలపల్లి మండలంలో 12.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వారు వివరించారు.

నేడు భూపాలపల్లి జడ్పీ ప్రత్యేక సమావేశం

కృష్ణకాలనీ, జూలై 3 : జయశంకర్ భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ ఆదేశాల మేరకు నేడు జడ్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశం అనంతరం సభ్యుల పదవీ కాలం ముగుస్తుండడంతో వారిని సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు తెలుపనున్నట్లు చెప్పారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

కృష్ణకాలనీ, జూలై 3 : సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్య పరిష్కారం, సత్వర న్యాయం అందించేందుకు జూలై 29 నుండి ఆగస్టు 3 వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించాలని సుప్రీంకోర్టు నిర్ణయించిందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన వారి కేసులు సుప్రీంకోర్టులో ఉంటే జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శిని గానీ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి హైదారాబాద్‌ను నేటి నుంచి సంప్రదించాలని పేర్కొన్నారు. కక్షిదారులు మరిన్ని వివరాలకు 040-23446723 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వీఆర్‌ఏపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

మహాముత్తారం, జూలై 3 : గ్రామంలోని రైతుల భూములను తన పేర, కొడుకు పేర వీఆర్ఏ ఆత్కూరి మల్లయ్య అక్రమంగా పట్టా చేసుకున్నాడని బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. మండలంలోని కొర్లకుంట శివారులోని 111/1 సర్వే నంబర్‌లో ఆత్కూరి సమ్మయ్యకు చెందిన 1.20 ఏకరాల భూమిని, సర్వే నంబర్ 209లో బోధ చిన్నన్నకు చెందిన 22గుంటలను వీఆర్ఏ మల్లయ్య పేరుపై, మాదారం శివారు 152/1 సర్వే నంబర్‌లో వెన్నపురెడ్డి రామయ్యకు చెందిన 35 గుంటల్లో 30 గుంటలు వీఆర్ఏ తన కొడుకు పేరుపై అక్రమ పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సమ్మయ్య, రామ్‌రెడ్డి, మనెక్క, పోచయ్య ఉన్నారు.

ములుగు ఓఎస్డీగా మహేశ్‌బాబా సాహెబ్ గీతే

ములుగురూరల్, జూలై 3 : ములుగు జిల్లా పోలీస్‌శాఖలో ఓఎస్డీగా నియామకమైన మహేశ్‌బాబా సాహెబ్ గీతే బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. గతేడాది కాలంగా ఓఎస్డీ పోస్టు ఖాళీగా ఉండగా, కొన్ని నెలల క్రితం నిర్వహించిన ఐపీఎస్ బదిలీల్లో ఏటూరునాగారం ఏఎస్పీగా విధుల్లో చేరారు. ప్రస్తుతం అక్కడి నుంచి ములుగు ఓఎస్డీగా నియమితులయ్యారు.

ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ బాధ్యతలు

ఏటూరునాగారం, జూలై 3 : స్థానిక ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఏఎస్పీగా పనిచేస్తున్న గీతే మహేశ్‌బాబా సాహెబ్ ములుగు ఓఎస్డీగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో శివం ఉపాధ్యాయను నియమించడంతో ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. కాగా, ఏటూరునాగారం సబ్‌డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్సైలు ఏఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందించి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనువాస్, ఎస్సై తాజొద్దీన్ పాల్గొన్నారు.

నాణ్యతా లోపంతో కూలిన శ్మశాన వాటిక


కూలిన సిమెంట్ దిమ్మెలు

వాజేడు, జూలై 3 : మండలంలోని కొంగాల జీపీ పరిధి జగన్నాథపురం గ్రామ శివారులో నిర్మించిన శ్మశాన వాటిక వద్ద నిర్మించిన సిమెంట్ దిమ్మెలు కూలిపోయాయి. నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యతను గాలికొదిలేశారు. దీంతో ఆది కాస్తా దెబ్బతిని కుంగిపోయి మంగళవారం కురిసిన వర్షానికి కుప్పకూలింది. అధికారుల నిర్లక్ష్యంతోనే లక్షల రూపాయలతో నిర్మించిన శ్మశాన వాటిక పేకమేడలా కుప్పకూలిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

కాళేశ్వరం హుండీలు లెక్కింపు

కాళేశ్వరం, జూలై 3 : కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం హుండీలను బుధవారం ఆలయ కార్య నిర్వహణాధికారి ఆధ్వర్యంలో లెక్కించారు. కార్యక్రమానికి ఈవో ప్రసాద్ హాజరై మాట్లాడారు. మూడు నెలల ఏడు రోజులకు రూ.21,44,464 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం యూనియన్ బ్యాంకు సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, విలేజ్ పోలీస్ అధికారి కనుకయ్య, వెంకట అన్నమాచార్య సేవా కామారెడ్డి, సిరిసిల్ల శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ ములుగు జిల్లా ఏర్పాటుపై గ్రామసభలు

వాజేడు, జూలై 3 : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో పలు పంచాయతీల్లో బుధవారం కార్యదర్శులు సమ్మక్క-సారలమ్మ ములుగు జిల్లా ఏర్పాటుపై గ్రామసభలు నిర్వహించారు. ప్రజల అభిప్రాయాలు సేకరించి కలెక్టర్ నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.